క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణాలు కాపాడిన విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: గుండె జబ్బుతో ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న ఒక పేషెంట్‌కు అత్యవసరంగా రక్తాన్ని దానం చేయడం ద్వారా టీజేపీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రాణాలు కాపాడారని ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. బీఎస్సీ ప్రథమ సంవత్సర విద్యార్థులు ఇసాక్, యువరత్న శనివారం ఒక పేషెంట్‌ను ఆదుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసినందుకు పట్టాభిపురంలోని కళాశాలలో వారిని అభినందించారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ విద్యార్థులకు రక్తదానంపై అవగాహన కల్పించడం ద్వారా సామాజిక సేవలో పాలు పంచుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జీవీ సుధీర్‌కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారిణి ఆర్. జయ శైలజ పాల్గొన్నారు.

ముగిసిన మూట్ కోర్టు పోటీలు

–ప్రెసిడెంట్ ట్రోఫీ కైవసం చేసుకున్న అంబేడ్కర్ లా వర్సిటీ



గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల రోడ్డులోని జాగర్లమూడి చంద్రమౌళి (జేసీ) న్యాయ కళాశాలలో రెండు రోజులపాటు జరిగిన మూడవ జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలు శనివారం ముగిశాయి. వివిధ రాష్ట్రాల్లోని 32 కళాశాలల నుంచి న్యాయ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రథమ స్థానంలో నిలిచిన చెన్నైలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ విశ్వ విద్యాలయ జట్టు ప్రెసిడెంట్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో నిలిచిన బెంగుళూరులోని అలైన్స్ వర్సిటీ జట్టు సెక్రటరీ ట్రోఫీ, తృతీయ స్థానంలో నిలిచిన తమిళనాడు రాష్ట్రం చెంగల్‌పట్టులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ట్రోఫీని గెలుపొందింది. జేసీ న్యాయ కళాశాల విద్యార్థిని పూజా జైన్ స్టాఫ్ ట్రోఫీ, త్రివేంద్రానికి చెందిన కేరళ అకాడమి విద్యార్థిని ఆర్య విన్నర్ ఆఫ్ నీసెర్చ్ టెస్ట్ పూర్వ విద్యార్థుల ట్రోఫీ గెలుచుకుంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ ప్రైవేటు న్యాయ కళాశాలల యాజమాన్య సంఘ అధ్యక్షుడు డాక్టర్ ఆర్. తిప్పారెడ్డి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్, కళాశాల కార్యదర్శి వేమన కుప్పుస్వామి, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, పాలకవర్గ సభ్యులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినేని సుధాకర్‌బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ, ఉపాధి



గుంటూరు ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ కల్పించి, ఉపాధి అవకాశాలను చూపేందుకు కృషి చేస్తున్నట్లు హిందూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నం సుబ్బారావు తెలిపారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో శనివారం వైజాగ్‌కు చెందిన సీఎస్‌సీ అకాడమీతో నైపుణ్య శిక్షణపై అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఒప్పందం ద్వారా వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై అధ్యాపకులకు, విద్యార్థులకు అవగాహన కలుగుతుందని చెప్పారు. త్రీడీ ప్రింటింగ్, రోబోటిక్ ప్రాసెసింగ్‌తో పాటు వాధ్వాని ఫౌండేషన్ ద్వారా 21వ శతాబ్దపు ఉపాధి నైపుణ్యాలను, పారిశ్రామిక వ్యవస్థాపకత శిక్షణ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కన్సల్టెంట్ వై. రామ్మోహన రావు, వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, విభాగాధిపతులు ఐతపు నాగాంజనేయులు, సూదా కృష్ణార్జునరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నిజమైన వారసుడు జగనన్న

- గుంటూరును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, పశ్చిమ సమన్వయకర్త విడదల రజిని
- 49వ డివిజన్‌లో 'మనతో మన రజినమ్మ' కార్యక్రమం



వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని

పట్నంబజారు: అంబేడ్కర్‌కు నిజమైన వారసుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలోని 49వ డివిజన్ వేళంగిణినగర్, అమరావతి రోడ్డు ప్రాంతాల్లో 'మనతో మన రజినమ్మ' కార్యక్రమం శనివారం జరిగింది. ముందుగా చంద్రమౌళీనగర్‌లోని పార్టీ కార్యాలయం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డివిజన్‌కు చేరుకుని అంబేడ్కర్, దివంగత మహానేత డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానికంగా కార్యకర్తలు, పార్టీ నేతలు మంత్రి రజినీకి ఘనస్వాగతం పలికారు. పెద్దఎత్తున బాణాసంచా పేల్చి సందడి చేశారు. తీన్‌మాన్ డప్పులు, డీజే సౌండ్‌లతో ఆ ప్రాంతమంతా ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ తెలుగు ప్రజలు గర్వపడేలా అంబేడ్కర్‌స్మృతివనాన్ని సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించారన్నారు. ఏకంగా రూ.400 కోట్లతో 19 ఎకరాల్లో విగ్రహ ఏర్పాటు జరిగి, బలహీనవర్గాల ఆత్మగౌరవాన్ని ఎంతగానో పెంపొందిస్తుందని తెలిపారు.

జగనన్నే మన ధైర్యం

ఎటువంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మనందరి ధైర్యమని మంత్రి విడదల రజిని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో ఆయన చేసిన మంచే మనల్ని గెలిపిస్తుందని తెలిపారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించి చెప్పాలని కోరారు. ఇంటి ఆడపచులా తాను అందరికీ, అన్ని వేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. గుంటూరు పశ్చిమలో తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. నగరాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి విద్యా, వైద్యం రంగాల్లో గుంటూరు ప్రాముఖ్యతను మరింతగా పెంచుతామని హామీ ఇచ్చారు. ఐటీని కూడా గుంటూరులో అభివృద్ధి చేసే విషయంలో తన వంతు కృషి చేస్తానని చెప్పారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో మన ఇంటి ఆడపడుచు రజినమ్మను అఖండ మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము) మాట్లాడుతూ అన్నివర్గాలకు మేలు చేసిన సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బోడపాటి ఉషారాణి, ఆయా డివిజన్‌ల కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, మండల అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులకు ప్రేరణ

జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్ బీజీ పార్థసారథి



ప్రాజెక్టు విశేషాలను ఆసక్తిగా వింటున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి

గుంటూరు ఎడ్యుకేషన్: వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులకు ప్రేరణ కల్పించవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి అన్నారు. బృందావన్‌గార్డెన్స్‌లోని ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ స్కూల్లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పోలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ వైజ్ఞానిక శాస్త్రాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా రాణించగలరని అన్నారు. డీఈఓ పి.శైలజ మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశాన్ని అగ్రగామిగా చేసేందుకు భావిశాస్త్రవేత్తలుగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరముందన్నారు. డాక్టర్ నిమ్మల శేషయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో పరిశోధన ఆసక్తి, ప్రయోగపూర్వక విజ్ఞానాన్ని రేకెత్తించడంలో విద్యాసంస్థలు కృషి చేయాలని సూచించారు. ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఎస్.ఫ్రాన్సిస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించే లక్ష్యంతో గల 25 ఏళ్లుగా ఖర్చుకు వెనుకాడకుండా భారీస్థాయిలో వర్కింగ్ మోడల్స్‌తో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా వివిధ క్యాంపస్‌ల నుంచి వచ్చిన విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక, విద్యా, వైజ్ఞానిక, పర్యావరణ, ఆధ్యాత్మిక రంగాలపై తాము రూపొందించిన నమూనా ప్రాజెక్టులు, వర్కింగ్ మోడల్స్‌ను ప్రదర్శించామని వివరించారు. పాఠశాల వైస్ చైర్మన్ ఎస్.ఆరోన్‌రెడ్డి, డైరెక్టర్లు ఎస్.విజయభాస్కర్ రెడ్డి, ఎస్.ఆరోగ్య జోసఫ్ రెడ్డి, ప్రిన్సిపాల్ అమీనాబేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించాలి

ఆర్ఐఓ జీకే జుబేర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్ ప్రాక్టికల్స్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియెట్ విద్య ఆర్ఐఓ జీకే జుబేర్ పేర్కొన్నారు. శనివారం సాంబశివపేటలోని ఏసీ కళాశాల ఆడిటోరియంలో గుంటూరు జిల్లాలోని 156 జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, సైన్స్ అధ్యాపకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జుబేర్ మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ బోర్డు మార్గదర్శకాల మేరకు ప్రాక్టికల్స్ నిర్వహణలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రాక్టికల్స్ ముగిసిన వెంటనే విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే విషయంలో పొరపాట్లకు తావు లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ఇంటర్ థియరీ పరీక్షల ఫీజు చెల్లించని విద్యార్థులు తత్కాల్ కింద ఈనెల 10వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందని తెలిపారు. సమావేశంలో జిల్లా వృత్తి విద్యాధికారి పద్మ, డీఈసీ సభ్యులు జి.బాలమోహన్ రావు, బి.రవి కుమార్, ఎల్.కోదండరామ్, ఎస్.రమేష్, సీహెచ్ ప్రకాశరావు, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్ పాల్గొన్నారు.

ఆ..నాటి.. ఆ స్నేహ ఆనందగీతం..



సమ్మేళనానికి హాజరైన పూర్వ వైద్య విద్యార్థులు

గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల 1981 ఎంబీబీఎస్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం పేరుతో కలుసుకున్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో స్థిరపడిన వైద్యులతోపాటు, విదేశాల్లో ఉంటున్న వారు సైతం సుమారు 42 ఏళ్ల తరువాత వైద్య కళాశాలలో కలుసుకుని నాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. గుంటూరు జీజీహెచ్‌ను అభివృద్ధి పథంలో తీసుకెళుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్‌ను పలువురు వైద్యులు అభినందించారు. డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ డాక్టర్ పాదిల ప్రసాద్ జీజీహెచ్ అభివృద్ధికి గతంలో రూ. 5 కోట్లు ఇచ్చినా, మళ్లీ నేడు రూ. 2 కోట్లు ఇచ్చేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి, మచిలీపట్నం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి, కృష్ణా జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని, డాక్టర్ మస్తాన్, డాక్టర్ మొహమ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నగదు చోరీపై కేసు నమోదు

పట్నంబజారు: ప్రయాణికుడి జేబు నుంచి నగదు దోచుకున్న ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత గుంటూరుకు చెందిన ఎం.కాశిదాసు శనివారం కొత్తపేటలోని శ్రావణి హాస్పటల్‌కు మందులు తీసుకునేందుకు వచ్చారు. తిరిగి ఇంటికి వెళుతున్న క్రమంలో ఆటో ఎక్కారు. ఆయన పక్కన కూర్చున్న ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా వ్యవహరిస్తుండటంతో ఆటో దిగేశారు. తరువాత జేబు చూసుకోగా రూ. 30వేలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనందపేట ఆరో లైను నుంచి ఖాదర్ అనే వ్యక్తి ఇళ్ల నుంచి రేషన్ సేకరించి, ఇతర ప్రాంతాల్లో విక్రయించేందుకు తీసుకెళుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. 75 బస్తాల్లో 3,750 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దంపతులపై దాడి

గుంటూరు ఈస్ట్ : ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో దంపతులపై దాడిచేసిన వారిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. భవానీపురంలో నివాసం ఉండే పేరయ్య, శివపార్వతి దంపతులు వెంకటేశ్వర్లుకు గతంలో రూ. 10 లక్షలు అప్పు ఇచ్చారు. దాన్ని చెల్లించలేక తన ఇంటి పై పోర్షన్‌లో అద్దె చెల్లించకుండా ఉండమని పేరయ్య దంపతులకు చెప్పాడు. ఈ మేరకు దంపతులు పోర్షన్‌లో నివాసం ఉంటున్నారు. శనివారం వెంకటేశ్వర్లు కుమారుడు సతీష్‌కుమార్, మరికొందరు కుటుంబ సభ్యులు పేరయ్య వద్దకు వెళ్లి అద్దె చెల్లించాలని గొడవ పడ్డారు. ఈ నేపథ్యంలో పేరయ్య దంపతులపై దాడి చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన ముగ్గురి అరెస్టు

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా మద్యం కలిగి ఉన్న ముగ్గురిని సెబ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరండల్‌పేటలోని సెబ్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బాలాజీనగర్ జీరో లైనులోని ఓ ఇంటిలో మద్యం నిల్వ ఉంచి విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఆవుల సుజాత, కరెవరపు శ్రీను, షేక్ మాలిక్‌బాషాలను అరెస్టు చేసి, 85 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు అడిషనల్ ఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

జిల్లాస్థాయి స్పెల్‌బీ పోటీలకు స్పందన



స్పెల్‌బీ పోటీల విజేతలతో కృష్ణప్రసాద్, రజని, రథినీ చౌదరి

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్లో శనివారం జిల్లాస్థాయి స్పెల్‌బీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల మాథమాటిక్స్ అండ్ హ్యూమనిటీస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. రజిని న్యాయనిర్ణేతగా పాల్గొని క్విజ్ పోటీల్ని ప్రారంభించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఉచ్చారణ భాషకు గుండె వంటిదని, పదాలను స్పష్టంగా పలకడంలో ఇటువంటి పోటీలు దోహదం చేస్తాయని తెలిపారు. ప్రిన్సిపాల్ వై.రథినీచౌదరి మాట్లాడుతూ ప్రపంచ భాష అయిన ఆంగ్లంలో రాణించేందుకు స్పెల్‌బీ పోటీలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. న్యాయనిర్ణేత రజిని మాట్లాడుతూ పదాల ఉచ్చారణలో స్పష్టతను తెలుసుకోవడంతో పాటు విద్యార్థులు మంచి వక్తలుగా ఎదగడంలో ఇటువంటి పోటీలు తోడ్పడతాయని తెలిపారు. జిల్లాలోని 32 పాఠశాలల నుంచి పోటీల్లో పాల్గొన్న జట్లలో ఆరు జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. వీటిలో తుది పోటీలో కేఎల్పీ స్కూల్ జట్టు 80 పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలువగా, 35 పాయింట్లతో భాష్యం ద్వితీయ, 30 పాయింట్లతో సెయింట్‌జాన్స్ స్కూల్ తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా విజేతలకు నగదు బహుమతి, జ్ఞాపిక, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ఏలూరుకు తరలివెళ్లిన విద్యార్థులు



ర్యాలీగా వెళ్తున్న పానుగంటి చైతన్య, విద్యార్థులు

విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి ఆధ్వర్యంలో ర్యాలీ

పట్నంబజారు: విద్యార్థులే నవసమాజ నిర్మాతలు అని మనసా వాచా కర్మణా త్రికరణ శుద్ధిగా నమ్మిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య చెప్పారు. ఏలూరులో శనివారం జరిగిన సిద్ధం కార్యక్రమానికి విద్యార్థులతో కలిసి ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ విప్లవాత్మకమైన సంస్కరణలతో వేల కోట్ల రూపాయలను విద్యార్థుల కోసం సీఎం జగనన్న ఖర్చు చేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల ఉన్నతికి నిస్వార్థంగా శ్రమిస్తున్న ఆయనకు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్, రీజినల్ కో–ఆర్డినేటర్ విఠల్, గంటి, రవి, బాజీ, జగదీష్, వలి, బంటి, మహేష్, అజయ్ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు వేగవంతం

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇప్పటికే ప్రారంభమైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత వేగంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్ నుంచి అధికారుతో వర్చువల్ విధానంలో ఆయన మాట్లాడారు. గత నెల 27 నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియను ఈ నెల 9లోపు ముగించాలన్నారు. పట్టాలకు సంబంధించి 1,46,280 మంది లబ్ధిదారులను మ్యాపింగ్ చేయాల్సి ఉండగా 1,36,044 మందిని చేశారన్నారు. ఇంకా 10,236 మందిని మ్యాపింగ్ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. డేటాలో సమస్యలు ఏర్పడి రిజిస్ట్రేషన్ కాని వాటిపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని కూడా చేయాలని అధికారుల్ని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ సమయంలో ప్లాటు నంబర్, సర్వే నంబర్, బౌండరీలు తప్పులు లేకుండా నమోదు చేయాలని చెప్పారు. తాడేపల్లిలో 3,777 ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరైనా పంపిణీ చేయలేదని, వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆరోగ్యశ్రీని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ప్రభుత్వం పెంచిందని, ఇది ఎంతో ఉపయోగమని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జేసీ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, ఆర్డీఓ పి.శ్రీకర్, అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌దే భవిష్యత్తు



మాట్లాడుతున్న ప్రభాకరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక మానవ జీవన వేగానికి అవసరమైన సాంకేతిక అవసరాలను అందిస్తున్న ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌దే భవిష్యత్తు అని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎస్. ప్రభాకరరావు తెలిపారు. గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగ ఆధ్వర్యంలో 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ)'పై మూడు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ శనివారం ముగిసింది. వైజాగ్‌కు చెందిన ఫ్రోగ్స్ కంపెనీ నిర్వహించిన వర్క్‌షాప్‌లో ప్రిన్సిపాల్ ప్రభాకరరావు మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో ఎక్కువగా ఉపయోగిస్తున్న ఐఓటీ అనేకమందికి ఉపాధిని కల్పిస్తోందని తెలిపారు. పరిశ్రమలు, వాహనాల యాంత్రీకరణ, క్వాలిటీ కంట్రోల్, వస్తు రవాణా తదితర రంగాల్లో ఈ సాంకేతికను వినియోగిస్తున్నారని వివరించారు. 108 మంది డిప్లొమా ద్వితీయ సంవత్సర విద్యార్థినులు మూడు రోజులపాటు ఐఓటీ పరికరాలతో ప్రత్యక్ష పద్ధతిలో పని చేస్తూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ పొందారని చెప్పారు. కార్యక్రమంలో ఫ్రోగ్స్ రీసోర్స్ పర్సన్ వారణాసి పవన్‌కుమార్, సమన్వయకర్తలు రాజ్యలక్ష్మి, కిరణ్‌కాంత్, ఈసీఈ విభాగాధిపతి రమాసుందరి, సీనియర్ అధ్యాపకులు శ్రీవల్లి, గోమతి, కిరణ్మయి, ప్రభావతి పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఆధునిక బోధన భేష్



మాట్లాడుతున్న ఐటీసీ జనరల్ మేనేజర్ వెంకట్రామిరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అత్యున్నత సాంకేతిక విద్యాసంస్థలకు దీటుగా ఆధునిక విద్యాబోధన అందించడం అభినందనీయమని ఐటీసీ జనరల్ మేనేజర్ వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ''ఇంటరాక్టివ్ ఇనిస్టిట్యూషనల్ మెథడాలజీస్'' అనే అంశంపై ఐదు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఈసందర్భంగా గణితశాస్త్రంలో మెళకువలతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా బోధనలో టూల్స్‌ను ఉపయోగించే విధానంపై వర్క్‌షాప్‌లో అధ్యాపకులకు శిక్షణ కల్పించారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో బోధన, అభ్యసనంలో ఆధునిక ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను గణితశాస్త్రంలో వినియోగంలో తేవడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు. కళాశాల విద్య కమిషనరేట్ అకడమిక్ గైడెన్స్ అధికారి డాక్టర్ తులసి మస్తానమ్మ మాట్లాడుతూ ఐఐటీలకు దీటుగా ప్రభుత్వ మహిళా కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులు ఆధునిక బోధన పద్ధతులు అలవర్చుకుంటున్నారని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ అధ్యాపకుల్లో బోధన నైపుణ్యాలను అభివృద్ధి పర్చేందుకు నిర్వహించిన వర్క్‌షాప్‌కు వివిధ డిగ్రీ కళాశాలల నుంచి 51 మంది అధ్యాపకులు పాల్గొన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల గణితశాస్త్ర విభాగాధిపతి పి. నిర్మలాకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుడి అరెస్టు

గుంటూరు ఈస్ట్ : వ్యక్తిపై దాడి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కేవీపీ కాలనీలో నివాసం ఉండే కార్తిక్ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో పాత కక్షల నేపథ్యంలో బత్తుల అశోక్‌కుమార్, అతని అనుచరులు జనవరి 30న రాళ్లు,కర్రలతో దాడిచేశారు. స్థానికులు అడ్డుకున్నారు. గాయపడిన కార్తిక్ చికిత్స అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దాడి చేసిన అశోక్‌కుమార్‌ను అరెస్టు చేశారు.